
# సాక్షి తిరుపతి

శనివారం ׀ 6 ׀ ఏప్రిల్ ׀ 2024

I

## దేవతలారా రండి!

తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. - IIలో



## పొడగంటిమయ్యా మిమ్ము..!

తిరుమలలో అన్నమయ్య వర్ధంతిని పురస్కరించుకుని సంకీర్తనల గోష్టి గానంతో సప్తగిరులు పులకించాయి. - IIలో

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ శనివారం (సా) | సహర్ ఆదివారం (ఉ) |
|---|---|---|
| తిరుపతి | 6-28 | 4-45 |
| గూడూరు | 6-23 | 4-41 |

## న్యూస్‌రీల్

### అణగారిన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్



నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

**తిరుపతి కల్చరల్:** సమసమాజం కోసం నిరంతరం కృషి చేస్తూ అణగారిన వర్గాల జీవితాలలో వెలుగులు నింపిన ఆశాజ్యోతి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ అని జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి కొనియాడారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బైరాగిపట్టెడలోని బాబు జగ్జీవన్‌రామ్ పార్కులోనున్న ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉప ప్రధానిగా, వివిధ శాఖల మంత్రిగా నీతి, నిజాయితీ, నిబద్ధతో పనిచేసిన ఆదర్శనీయులన్నారు. ఆయన ఆశయాల సాధనలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా బీసీ సంక్షేమ సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు. అలాగే బాబు జగ్జీవన్‌రామ్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ కమిటీ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

### ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్, జేసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం, తిరుపతి కమిషనర్ అదితిసింగ్

**తిరుపతి అర్బన్:** సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా, సమిష్టి కృషితో విజయవంతం చేయడమే లక్ష్యంగా అంతా పనిచేయాలని నూతన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఏపీఐఐసీ ఎండీగా పనిచేస్తున్న ఆయన తిరుపతి కలెక్టర్‌గా బదిలీ చేసిన నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం తిరుపతి జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, జేసీ ధ్యానచంద్ర హెచ్‌ఎం తోపాటు తిరుపతి నగర కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచల కిషోర్, పలువురు ఆర్డీవోలు, పలు విభాగాల జిల్లా అధికారులు కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతా ఎలక్షన్ మూడ్‌లోకి వెళ్లాలని పేర్కొన్నారు.

### 93.49 శాతం పింఛన్ల పంపిణీ

**తిరుపతి అర్బన్:** జిల్లాలో శుక్రవారానికి 93.49 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు సంబంధిత అధికారులు పేర్కొన్నారు. మొత్తం 2,71,477 మందికిగాను ఇప్పటివరకు మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేసినట్టు వెల్లడించారు. మరో ఒకటి రెండు రోజుల్లో వంద శాతం పంపిణీ చేస్తామని చెప్పారు.

### మార్గదర్శకాలే.. ఎన్నికల మూల సూత్రాలు

**తిరుపతి అర్బన్:** ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలే మూల సూత్రాలుగా భావించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికలు విధులు కేటాయించిన ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఏ ఒక్క ఉద్యోగి నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఈ క్రమంలో ఎవరి బాధ్యత వారు వందశాతం విజయవంతంగా నిర్వర్తించాలని చెప్పారు. ముందుగా ఎన్నికల కమిషన్ ఆదేశాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలన్నారు. గతంలో ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ కొత్త నిబంధనలపై పూర్తి అవగాహన అవసరమన్నారు. నోడల్ అధికారులు, ఈఆర్వోలు, అసిస్టెంట్ ఈఆర్వోల బాధ్యతలను తెలియజేశారు.

### శ్రీవారి దర్శనానికి 16 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 62,549 మంది స్వామివారిని దర్శించుకోగా 26,816 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.33 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# మళ్లీ నువ్వే సీఎం.. మేమంతా సిద్ధం!



గత బుధవారం చంద్రగిరి నియోజకవర్గం, దామలచెరువులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర, సభలకు జనం పోటెత్తారు. అడుగడుగునా హారతులు పట్టి, దిష్టితీసి, దీవెనలందించారు. బస్సు యాత్రగా వస్తున్న సీఎం జగన్‌కు ఎదురెళ్లి స్వాగతం పలికారు. 'నువ్వే మళ్లీ సీఎం.. మేమంతా సిద్ధం' అంటూ నినాదాలు హోరెత్తించారు. ముసలి, ముతక, చిన్నాపెద్దా తేడాలేకుండా అభిమాన నేతను చూసి తరించారు. సెల్ఫీలు దిగి సంతోషంతో ఉప్పొంగిపోయారు. కరచాలనానికి పోటీపడ్డారు. దారిపొడవునా పూల వర్షం కురిపించారు. గుండెగుడిలో గూడుకట్టుకున్న అభిమానాన్ని రంగరించి ఆత్మీయతను పంచారు. ఈ బస్సు యాత్ర వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ నింపగా.. కపట కూటమి నేతల్లో వణుకుపుట్టిస్తోంది.

- మేమంతా సిద్ధం సభలు సూపర్ సక్సెస్
- మండేఎండను సైతం లెక్కచేయకుండా ఊరూవాడా తరలివచ్చిన వైనం
- పూతలపట్టు, నాయుడుపేట బహిరంగ సభలకు పోటెత్తిన జనం
- రెండు జిల్లాల్లో మూడు రోజుల పాటు సాగిన బస్సు యాత్రకు నీరాజనం
- సీఎం వైఎస్ జగన్ యాత్ర విజయవంతంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్
- కపట కూటమిలో మొదలైన వణుకు

**సాక్షి, తిరుపతి:** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పలు సంక్షేమ పథకాలను అందుకుంటున్న అనేక మంది లబ్ధిదారులు బస్సు యాత్రలో దారి పొడవునా జననేతకు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. అప్యాయంగా పలుకరిస్తూ 'నువ్వు సల్లగా ఉండాలి నాయనా' అంటూ దీవించి ముందుకు సాగనంపారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర చిత్తూరు, తిరుపతి జిల్లాలోని పలు గ్రామాల మీదుగా సాగింది. ఈ బస్సు యాత్రలో మరోసారి పల్లెలను పలుకరిస్తూ.. స్థానికుల సలహాలు, సూచనలు తీసుకుంటూ ముందుకు సాగారు. ఈనెల 2న ప్రారంభమైన మేమంతా సిద్ధం బస్సు యాత్ర చౌడేపల్లి, పుంగనూరు, సదుం, కల్లూరు, పాకాల, ఐరాల, పూతలపట్టు, చంద్రగిరి, తిరుపతి రూరల్, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, గూడూరు మండలాల మీదుగా సాగింది. బస్సు యాత్ర సాగినంత దూరం సీఎం వైఎస్ జగన్‌ని చూసేందుకు జనం బారులు తీరారు. సీఎం బస్సు దిగి వారందరినీ ఆప్యాయంగా పలకరించి ముందుకు సాగారు. చంద్రగిరి నియోజకవర్గం దామలచెరువులో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ స్వాగతం లభించింది. దామలచెరువుకు ముందే ఉగాది పండుగ వచ్చిందా? అనిపించేలా పండుగ వాతావరణం కనిపించింది.

**ఆత్మీయ సమావేశం**

కల్లూరు శివారు ప్రాంతంలో కురుబ సామాజిక వర్గం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. తొట్టంబేడు మండలం, చిన్నసింగమాల వద్ద ఏర్పాటు చేసిన ఆటో యూనియన్ వారు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో సీఎం పాల్గొని భరోసా కల్పించారు. వారి ఆత్మీయతతో సీఎం వైఎస్ జగన్ పులకరించిపోయారు. ఇదిలా ఉంటే.. కల్లూరులో నిర్వహించిన బస్సు యాత్రకు ముస్లింమైనారిటీ మహిళలు పోటెత్తారు. దారిపొడవునా సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం పలికారు. శ్రీకాళహస్తి, నాయుడుపేటలో ట్రాంజెండర్స్ సీఎం వైఎస్ జగన్‌కి గుమ్మడి కాయలతో దిష్టి తీసి ఆశీర్వదించి ముందుకు సాగనంపారు.

**కూటమిలో వణుకు**



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభించడంతో కూటమి నేతల్లో వణుకు పుట్టింది. చంద్రబాబు వెంకటగిరి, గంగాధరనెల్లూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, కుప్పంలో నిర్వహించిన అన్ని బహిరంగ సభలకు హాజరైన జనం ఒక ఎత్తైతే.. సీఎం వైఎస్ జగన్ చేపట్టిన మేమంతా సిద్ధం సభ ఒక్కటీ ఒక ఎత్తుగా నిలిచిందని జనం చర్చించుకోవడం కనిపించింది. అదేవిధంగా మేమంతా సిద్ధం సభలు, బస్సు యాత్రకు వెళ్లలేని అనేక మంది టీవీలకు అతుక్కుపోయి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన, ప్రసంగాన్ని వినడం విశేషం. మారుమూల గ్రామాల నుంచి మేమంతా సిద్ధం సభలకు తరలిచ్చే జనాన్ని చూసిన జనం, మరో వైపు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు 'కూటమి కుదేలవ్వడం ఖాయం' అని చర్చించుకోవడం గమనార్హం.

**మేమంతా సిద్ధం సభలకు పోటెత్తిన జనం**

బస్సు యాత్రలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పూతలపట్టు, నాయుడుపేటలో మేమంతా సిద్ధం సభలు నిర్వహించారు. జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన బహిరంగ సభలకు చిత్తూరు, తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలోని జనం, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా.. పనులన్నింటినీ పక్కనబెట్టి జననేతను ఒక్కసారి చూసేందుకు పరితపించిపోయారు. ఆయా పార్లమెంట్ పరిధి నుంచి వచ్చిన వారితో సభా ప్రాంగణం నిండిపోయి జాతీయ రహదారి కూడా కిక్కిరిసిపోయింది. కి.మీ మేర వాహనాలు నిలిచిపోయాయి.



గురువారం నాయుడుపేటలో జరిగిన సిద్ధం సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

**కూటమి కుదేలే**



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఆయన చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర జన యాత్రగా సాగుతోంది. ఈ యాత్రకు వస్తున్న స్పందన చూసి కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అవ్వాతాతలకు నెలనెలా ఇంటికి వెళ్లి పింఛన్లు ఇచ్చే వలంటీర్లను తొలగించి కూటమి నేతలు రాక్షసానందం పొందుతున్నారు. కేవలం 45 రోజుల్లో కూటమి నేతలు కుదేలవ్వడం ఖాయం.

– విజయరాయల్, తిరుపతి

**తట్టుకోలేరు**



పెద్దాయన బిడ్డ జగన్ వస్తున్నాడని పూతలపట్టుకు వెళ్లాను. రంగంపేట క్రాస్ నుంచి సభ వరకు జన సునామీ. బస్సు యాత్రగా వస్తున్న జగన్‌ను చూసేందుకు జనం నిండిపోయారు. అది ప్రజాభిమానం. ఇలాంటి అభిమానం రాష్ట్రంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ఉంటుంది. ప్రతిపక్షాలు ఆ జనాన్ని చూసి తట్టుకోలేకపోయారు. మేము ఏం పాపం చేశాం.. మాకు ఇంటికొచ్చి పింఛన్ కార్యక్రమాన్ని అడ్డుకుంటారా..? ఈ చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పురందేశ్వరిలు. వాళ్లకు జనమంతా జగన్‌వైపు ఉండారని కడుపు మండి ఇలా చేస్తున్నారు. కారు కూతలు కూసే ఒక్కొక్కరికీ ఈ ఎన్నికలు నోరు మూయిస్తాయి.

– భాస్కర్‌రెడ్డి, చిత్తూరు

**మేమంతా మీవెంటే**

అన్నా నేను నీ భక్తుడిని. మేమంతా మీ వెంటే ఉంటాం. మా పిల్లల చదువు కోసం అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన ఇచ్చావు. ఇల్లులేని మాకు ఇంటి స్థలం ఇచ్చి పక్కాగృహం నిర్మించావు. దేవుడిలాంటి మిమ్మల్ని గెలిపించుకుంటాం. బాబుని, దత్తపుత్రుడ్ని తరిమికొడతాం.

– పూర్ణేష్, శ్రీకాళహస్తి

**మరో ముప్పై ఏళ్లు మీరే**

అన్నా మీ వల్ల అనేక ప్రయోజనాలు పొందాము. ఒక సీఎంతో ఇలా నేరుగా మాట్లాడతానని కలలో కూడా అనుకోలేదు. ఈ సంతోషంలో నోటి నుంచి మాటలు రావడం లేదు. ముప్పై ఏళ్ల ముఖ్యమంత్రి మీరే అన్నా.


– వెంకటేష్, తిరుపతి

**ఒకసారి చూసెళ్దామని!**

ఐదేళ్ల క్రితం ఇదే దారిలో వచ్చిన జగన్ బిడ్డ నాకు మాటిచ్చాడు. నాడు ఇచ్చిన మాట ప్రకారం ఇంటికే పెన్షన్ పంపుతున్నాడు. ఐదేళ్ల తరువాత మళ్లీ మా ఊరి మీదుగా వెళ్తున్నాడని తెలిసి రోడ్డు మీదికి వచ్చాను. ఒకసారి చూసి వెళ్దామని ఉన్నాను. మళ్లీ జగన్ బాబే సీఎం అవుతాడు.

– మునెమ్మ, సదుం మండలం

# వైఎస్సార్‌సీపీలోకి వలసల వెల్లువ



మేలుందొడ్డిలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మద్దతుదారులు

**పుంగనూరు:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీకి చెందిన 70 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం మండలంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మేలుందొడ్డి, గోపిశెట్టిపల్లెకు చెందిన పలువురు వెంకటప్ప ఆధ్వర్యంలో సుమారు 30 మంది పార్టీలో చేరారు. అలాగే సింగిరిగుంటలో శివ, రెడ్డెప్ప, హరికృష్ణ, చిరంజీవి, చంద్రతో కలసి 15 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. కుమ్మరగుంట గ్రామానికి చెందిన శీనప్ప, సుబ్రమణి, మునిరాజు, చిన్నరెడ్డెప్ప,గట్టప్ప, మునిరాజప్ప, బాలాజీతో పాటు 25 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. సుమారు 70 మంది పార్టీలో చేరారు. వీరందరికీ మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీని పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ ఆర్టీసీ మజ్దూర్ అధ్యక్షుడు జయరామిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కొత్తపల్లి చెంగారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోయిరా చెల్లీ!

- ముగిసిన ముత్యాలమ్మ జాతర
- అట్టహాసంగా పోలేరమ్మ నిమ్మజ్జనం

**చిల్లకూరు:** ఏడాదికి ఒకసారి వచ్చే పోలేరమ్మ తన అక్క ముత్యాలమ్మకు వెళ్లి వస్తానని పలకరించే సన్నివేశాన్ని గణాచారి రక్తికట్టించారు. ఈ ఘట్టాన్ని భక్తులు తన్మయత్వంతో తిలకించి పులకించిపోయారు. ఈ సందర్భంగా అక్కా పోయి వస్తానే..! అంటూ పోలేరమ్మ అంటుండగా.. వచ్చే ఏడాది మళ్లీరా చెల్లీ..! అని ముత్యాలమ్మ పలికినట్లు గణాచారి చెప్పడంతో అక్కడున్న భక్తులు పొలి కేకలు పెట్టి పోలేరమ్మ తల్లికి జై.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం గుడి వెనుక ఉన్న ద్వారంలో నుంచి పోలేరమ్మను ముత్యాలమ్మ ఆలయానికి కొంత దూరంలో ఉన్న జీడిమామిడి చెట్టు వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. దీంతో ముత్యాలమ్మ జాతర శుక్రవారం అట్టహాసంగా ముగిసింది. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూకట్టారు. పోలేరమ్మకు మూడు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం వేకువ జామున అమ్మవారికి ఏడు కుండల్లో వండిన అన్నం కుంభం పోశారు. అలాగే గణాచారికి ఊయలు సేవ నిర్వహించారు. గ్రామంలోని పెద్దలు అక్కడ పోలేరమ్మ కథను ఆసాదుల ద్వారా వినిపించారు. తర్వాత పొలి అన్నం గ్రామ శివారు ప్రాంతాలలో చల్లారు. చివరగా అమ్మవారి గుడి వద్దకు రాగానే పోలేరుతల్లి.. కరుణించుమ్మా.. జైపోలేరు..! అంటూ కేకలు వేస్తుండగా అమ్మవారి విగ్రహాన్ని తలపై మోసుకుంటూ గ్రామంలో ఊరేగింపుగా బయలు దేరారు.



నిమ్మజనానికి తరలుతున్న పోలేరమ్మ

**గణాచారి ముందు నడుస్తుండగా..**

గంగమిట్ట మీద నుంచి పోలేరమ్మ తల్లిని నిమ్మజనం చేసేందుకు తీసుకెళ్తుండగా గణాచారి నుంచి అనుమతి తీసుకున్నారు. పోలేరమ్మ నిమ్మజ్జనానికి వెళ్లే మార్గంలో మహిళలు సంతానం కోసం వరపడ్డారు. వారిపై నుంచి గణాచారి నడిచి వెళ్లారు.

**జాతర ఆదాయం రూ.59.22 లక్షలు**



కానుకలను లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

తూర్పుకనుపూరులో నాలుగు రోజులుగా నిర్వహించిన ముత్యాలమ్మ జాతరలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా రూ.39,87,837 ఆదాయం వచ్చినట్టు ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీలోని కానుకలు, టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. టికెట్ల ద్వారా రూ.11,05,000, హుండీల ద్వారా రూ.28,82,837, అలాగే భక్తులు సమర్పించిన 235 దున్నపోతులను వేలం వేయగా రూ.19.35 లక్షలు వచ్చినట్టు వెల్లడించారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసబాబు, దినేష్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



కౌంటింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

**తిరుపతి అర్బన్:** పోలింగ్ అనంతరం ఈవీఎంలను భద్రపరచడానికి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్‌కు పటిష్టమైన భద్రతా చర్యలు కల్పించాలని కలెక్టర్ ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్వీ జూనియర్ కాలేజీ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ భవనాలలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. తిరుపతి ఆర్డీఓ నిశాంత్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

**పాకాల:** రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన మండలంలోని తోటపల్లి సమీపంలో చోటు చేసుకుంది. శుక్రవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివశక్తినగర్‌కు చెందిన బండి రవీంద్రారెడ్డి(55) చిత్తూరు జిల్లా, శాంతిపురం మండలం, శివరామపురం హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. శుక్రవారం పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై తోటపల్లి సమీపంలో స్కూటర్‌పై రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

# మళ్లీ జగనన్న ప్రభంజనం ఖాయం

- దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమం, అభివృద్ధి
- చంద్రబాబు దుర్మార్గ ఆలోచన వల్లే పింఛన్‌దారులకు అవస్థలు
- వైఎస్సార్‌సీపీ విస్తృత ఎన్నికల ప్రచారంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి



చిన్న పాండూరులో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

**వరదయ్యపాళెం:** దేశంలో ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇచ్చారని, తద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగనన్న ప్రభంజనం ఖాయమని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి అన్నారు. వరదయ్యపాళెం మండలంలోని చిన్న పాండూరు, రాచర్ల గ్రామ పంచాయతీల్లో జరిగిన ఎన్నికల ప్రచారంలో సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌తో కలసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై రానున్న ఎన్నికల్లో సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలనుద్దేశించి ఎంపీ మాట్లాడుతూ.. విద్య, వైద్య రంగాల్లో, పరిపాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. పేద బడుగు, బలహీన వర్గాల సంక్షేమం ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. పేదలు, సామాన్యులంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి చులకన భావన అని ఆరోపించారు. చంద్రబాబు నాయుడు దుర్మార్గంగా వ్యవహించి తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, పేద, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇళ్ల వద్ద వలంటీర్ల ద్వారా పింఛన్ అందకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. పేదలు బాగుంటే ఆయన చూడలేరని విమర్శించారు.

**బాబు మోసాలను నమ్మొద్దు**

తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లు అవుతుందని సత్యవేడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. 2014లో మూడు పార్టీల మాయమాటలు నమ్మి కూటమికి ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచి ఒక్క హామీని అమలు చేయక మేనిఫెస్టోను గాలికి వదిలారని గుర్తుచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదన్నారు. ఇంతటి మేలు చేసిన జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సత్యవేడు, తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకులు దయాసాగర్‌రెడ్డి, బీరేంద్రవర్మ, మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, సీనియర్ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి జిల్లా మహిళా కన్వీనర్ బొర్రా మాధవి, సోషల్ మీడియా జిల్లా కో–కన్వీనర్ వేలూరు రాకేష్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు, జేసీఎస్ మండల కన్వీనర్ చిన్నా, నియోజకవర్గ యూత్ కార్యదర్శి మహేంద్ర, సచివాలయ కన్వీనర్లు గిరి, మాధవయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు బందిల సురేష్, సత్యవేడు సింగిల్ విండో చైర్మన్ నిరంజన్ రెడ్డి, మండల యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్ పాల్గొన్నారు.

# కొత్తగా ఓటు నమోదుకు 14న ఆఖరు

**తిరుపతి అర్బన్:** ఏప్రిల్ 1వ తేదికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటును పొందడానికి ఎన్నికల కమిషన్ ఈ నెల 14వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఆ మేరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేసుకున్న వారికి అర్హతను పరిశీలించి పది రోజుల్లో ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చుతారు. వీరంతా 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న తమ ఓటు హక్కును ఉపయోగించుకోవచ్చు.

**దరఖాస్తు ఇలా**

18 ఏళ్లు నిండినవారు కొత్త ఓటు కోసం హెల్ప్‌లైన్ యాప్ ద్వారా లేదా బీఎల్వోల ద్వారా ఫారమ్ 6లో దరఖాస్తు చేయాలి. వచ్చిన దరఖాస్తులను పది రోజుల్లో పరిశీలనను పూర్తిచేసి అధికారులు నిర్ణయం తీసుకుంటారు. కొత్తగా ఓటుహక్కు పొందినవారి పేర్లను అనుబంధ జాబితాలో చేర్చుతారు. అలాగే చనిపోయినవారు, ఆబ్సెంటీస్, బదిలీ ఓటర్ల వివరాలను ఏఎస్‌డీ జాబితాలో నమోదు చేసి, ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులకు అందజేస్తారు. ఇప్పటికే ఓటు కోసం దరఖాస్తు చేసి, ఓటు హక్కు పొందిన వారికి ఓటరు గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు.

**ఇదే చివరి అవకాశం**



సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి కొత్తగా ఓటును పొందడానికి ఇదే చివరి అవకాశం. అర్హత ఉన్నవారంతా ఓటు హక్కు పొందడమే కాకుండా, ఎన్నికల్లో కచ్చితంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. –ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్

# వైఎస్సార్‌సీపీలోకి 40 కుటుంబాలు



శ్రీకాళహస్తి: కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

**శ్రీకాళహస్తి:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వలసల వెల్లువ కొనసాగుతోంది. తొట్టంబేడు మండలం, ఎగువసాంబయ్యపాళెం గ్రామానికి చెందిన సుమారు 40 టీడీపీ కుటుంబాలు శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆది ప్రభాకర్‌రెడ్డి, సాయి, దుర్గాప్రసాద్, మోహన్, మునిరెడ్డి, రఘు, భాస్కర్, చెంచురెడ్డి, సోము, సహదేవరెడ్డి, నరేంద్ర తదితరులున్నారు. వారు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉంటున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసునాయుడు, మేఘనాథ్‌రెడ్డి, భాస్కర్, సుజాత, జగదీశ్వర్‌రెడ్డి, గంగాధరం, మోహన్, మణి పాల్గొన్నారు.

**వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు**

**చంద్రగిరి:** మండల పరిధిలోని దోర్నకంబాల పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం తుమ్మలగుంటలో తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఇంత కాలం టీడీపీలో కొనసాగినా తగిన గుర్తింపులేదని వారు వాపోయారు. అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు చేరువ చేయడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని, మళ్లీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అసెంబ్లీకి పంపుతామని ప్రతినబూనారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ప్రతాప్, రవి తదితరులు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు యారాసి చంద్రశేఖరరెడ్డి, చంద్రగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవీంద్రరెడ్డి, ఐతేపల్లి కిషోర్, రామ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరి: వైఎస్సార్‌సీపీలో చేరిన దోర్నకంబాలకు చెందిన టీడీపీ నేతలు



# ఓటర్ల చైతన్యానికి ప్రత్యేక స్వీప్



షార్ట్‌ఫిలిం పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

**తిరుపతి అర్బన్:** దేశ ప్రజాస్వామ్య విశిష్టతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్‌హెచ్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లో స్వీప్(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్)లో భాగంగా షార్ట్ ఫిలిం పోటీల పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు జేసీ, పలువురు అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడంలో భాగంగా వినూత్నంగా స్వీప్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సారి వంద శాతం పోలింగే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. ఈ క్రమంలో యువ ఓటర్లు చైతన్యం కోసం షార్ట్‌ఫిలం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ఈ నెల 20వ తేదీలోపు షార్ట్‌ఫిలిం వీడియో పంపాలని కోరారు. ఈ వీడియో నిడివి గరిష్టంగా 100 సెకండ్లు మించరాదన్నారు. ప్రధానంగా వీడియో ఓటు విలువ తెలియచేసేలా, నిజాయితీగా, నిర్భయంగా ఓటువేయడం, ఓటింగ్ శాతాన్ని పెంచడం ఈ మూడు అంశాలను క్రోడీకరిస్తు వీడియోలు తయారు చేసి పంపాలని వివరించారు. ఈ పోటీలో పాల్గొనేవారు తిరుపతి జిల్లాకు చెందినవారై ఉండాలని వెల్లడించారు. అదనపు సమాచారం కోసం 944003204, 9440573537 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, మునిసిపల్ కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచల కిషోర్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మురళీకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

# టీడీపీ ప్రచారంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు



టీడీపీ ఎన్నికల ప్రచారంలో శ్రీకాళహస్తి దేవస్థానం ఉద్యోగులు కుమార్, సురేష్

**రేణిగుంట:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో పని చేసే ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. సాయంత్రం వరకు ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఆలయ శానిటరీ సిబ్బంది కుమార్, సురేష్ సాయంత్రం నుంచి టీడీపీ ప్రచారాల్లో మునిగితేలుతున్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారులకు ఫిర్యాదులు చేశారు. వీరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**కోడ్ ఉన్నా..**

ఎన్నికల నియమావళి అమలులో ఉన్నా శ్రీకాళహస్తి పట్టణంలో టీడీపీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. శ్రీకాళహస్తి నుంచి చెన్నైకి వెళ్లే మార్గం ఎంజీఎం ఆస్పత్రి సమీపంలోని భక్తకన్నప్ప కూడలి చుట్టూ టీడీపీ జెండాలు కట్టారు. వాటిని తొలగించాలని ఫిర్యాదు చేసినా తొలగించకపోవడం విశేషం.

# బాబు దుర్మార్గం వల్లే పింఛన్ పాట్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట టౌన్ :** చంద్రబాబు దుర్మార్గంగా వ్యవహరించి వలంటీర్లను నిలువరించడం వల్లే రాష్ట్రంలో 40 మందికి పైగా వృద్ధులు మృత్యువాత పడ్డారని, వారి ఉసురు టీడీపీకి తగలకుండా పోదని సూళ్లూరుపేట నియోజవర్గ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దుమ్మెత్తి పోశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మంచి చేయాలనే తలంపుతో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామునే ఇంటి వద్దకు వచ్చి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేసేవారని గుర్తుచేశారు. అలాంటి వారి సేవలు గిట్టక చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వారిని పక్కన పెట్టిందన్నారు. జూన్‌లో మళ్లీ వలంటీర్ల సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషోర్ యాదవ్, కలికి మాధవ్‌రెడ్డి, కటకం జయరామయ్య, పాదర్తి హరినాథ్‌రెడ్డి, చదలవాడ కుమార్, ధార రవి, అన్నమేటి చంద్రారెడ్డి, నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొడగంటిమయ్యా మిమ్ము పురుషోత్తమా!

- అన్నమయ్య సంకీర్తనలతో పులకించిన నారాయణగిరి

**తిరుమల:** పదకవితా పితామహుడు శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల 521వ వర్ధంతిని పురస్కరించుకుని సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానంతో సప్తగిరిలు పులకించాయి. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీమాన్ శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామిజీ అనుగ్రహభాషణం చేశారు. అన్నమయ్యకు, వారి ఆచార్యపీఠమైన అహోబిల మఠానికి ఎంతో అనుబంధం ఉందన్నారు. అన్నమయ్య విద్యాభ్యాసం, వేదశాస్త్రాల అధ్యయనం ఇక్కడే సాగిందని చెప్పారు. అహోబిలం శ్రీ నరసింహస్వామివారి అనుగ్రహంతో శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు దీక్ష పొంది మంత్రోపదేశం పొందారని వివరించారు. ఈ మంత్రోపదేశంలోని 32 బీజాక్షరాలతో అన్నమయ్య 32 వేల సంకీర్తనలు రచించారన్నారు. గత 15 ఏళ్లుగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం శ్రీవారి అనుగ్రహం అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా టీటీడీ అన్నమయ్య జయంతి, వర్ధంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నమయ్య సంకీర్తనలను జనబాహుళ్యంలోకి తీసుకువెళ్లడానికి మరింత మంది యువ కళాకారులు కృషి చేయాలని స్వామీజీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వామీజీకి గరుడ పురాణం 1– 2 పుస్తక ప్రసాదాన్ని ఈవో ఏవీ.ధర్మారెడ్డి అందించారు. తరువాత స్వామీజీకి శ్రీవారి ప్రసాదాలు అందజేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు ఆకెళ్ల విభీషణ శర్మ మాట్లాడారు. ఎస్టేట్ అధికారి మల్లికార్జున, హెల్త్ అధికారి శ్రీదేవి, పేష్కార్ శ్రీహరి, ఏవీఎస్‌ఓలు మనోహర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.



ఆలపిస్తున్న అన్నమయ్య సంకీర్తనలు

# దేవతలారా రండి!

- వేడుకగా కోదండరామస్వామి ధ్వజారోహణం

**తిరుపతి కల్చరల్:** శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో శుక్రవారం ఉదయం చేపట్టిన ధ్వజారోహణంతో స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. టీటీడీ ఆగమ సలహాదారు, కంకణభట్టార్ సీతారామాచార్యల ఆధ్వర్యంలో ఉదయం మేష లగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో గరుత్మంతుని చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపజేశారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడంతో పాటు సమాజ శ్రేయస్సుకు, వంశాభివృద్ధికి ధ్వజారోహణం దోహదపడుతుందని అర్చకులు తెలిపారు. దీనికి ముందు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామివారు, ధ్వజపటం, చక్రత్తాళ్వారులకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆస్థానం చేపట్టారు. తర్వాత శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పెద్ద జీయర్ స్వామి, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, ఆనగరత్న, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ సోమశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు చలపతి, సురేష్ పాల్గొన్నారు.



శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి, ధ్వజపటం, చక్రత్తాళ్వారుల తిరువీధి ఉత్సవం



కోదండరాముని బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణంలో వేదపండితులు